సంక్షోభంలో ఇటుక పరిశ్రమ

- అమ్మకాల కోసం బట్టీ యజమానుల ఎదురుచూపులు
- పాత స్టాకు అయితేనే కొత్త ఇటుక తయారీకి చాన్స్
- పెరిగిన కూలి, ముడిసరకుల ధరలు


ముక్తేశ్వరంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఇటుక బట్టీలు


బట్టీల్లో నిల్వ ఉంచిన ఇటుక

అయినవిల్లి: ఇటుక పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. గత సీజన్‌లో తయారైన ఇటుకలు కూడా ఇప్పటికీ అమ్ముడుపోలేదు. దానికి తోడు కొత్త ఇటుకల తయారీకి వాతావరణం అనుకూలించడం లేదు. ఫలితంగా ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయి. పనులు లేక కూలీలు.. ఇటుకలు అమ్ముడుపోక బట్టీల యజమానులు నానా అగచాట్లూ పడుతున్నారు. ఇసుక లభించక చాలా చోట్ల కొత్త భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఇటుకలు కొనే వారే లేకుండా పోయారని బట్టీల యజమానులు పేర్కొంటున్నారు. ఇంతకు ముందు తయారు చేసిన ఇటుకలు కూడా అమ్ముడు పోలేదని వారు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని ముక్తేశ్వరం, అయినవిల్లిలంక, మడుపల్లి, కోటిపల్లి భాగ పరిసరాల్లో 50 నుంచి 60 వరకూ ఇటుక తయారు చేసే బట్టీలున్నాయి. దాదాపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతటికీ ఇక్కడి నుంచే ఇటుక సరఫరా జరుగుతుంది. వర్షాలు ప్రారంభం కాగానే బట్టీలన్నీ మూత పడ్డాయి. తయారీదారులు అప్పటికే అవసరానికి సరిపడా ఇటుకలు తయారు చేసి నిల్వ ఉంచారు. చిన్న బట్టీలైతే నాలుగు నుంచి ఐదు లక్షలు, పెద్ద బట్టీలైతే 10 లక్షల వరకూ ఇటుకలు నిల్వ పెట్టారు. బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్‌దారుల వద్ద, బంగారం తాకట్టు ద్వారా.. ఇలా ఎక్కడ వీలుంటే అక్కడ అప్పులు తెచ్చి మరీ ఇటుకల తయారీకి పెట్టుబడులు పెట్టారు. తీరా చూస్తే గత నాలుగు నెలలుగా ఇటుకల అమ్మకాలు లేవు. ప్రభుత్వం కేటాయించే గృహ నిర్మాణాలకు పెద్ద ఎత్తున అమ్మకాలు సాగుతాయని బట్టీల యజమానులు భావించారు. అయితే గృహ నిర్మాణాలపై కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. ప్రభుత్వ గృహాల నిర్మాణం కాకపోతే, సొంతంగా ఇళ్లు నిర్మించుకునే వారైనా ఇటుకలు కొనుగోలు చేయకపోతారా? అని ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ఖర్చుల కోసం ఎంతో కొంత ధర తగ్గించి ఇద్దామన్నా ఇటుకలు కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదని వీరు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లతో పాటు ప్రైవేట్ గృహాల నిర్మాణాలు కూడా కుంటుపడ్డాయి. సాధారణంగా దీపావళి తర్వాత నవంబర్ నుంచి మళ్లీ ఇటుకల తయారీ ప్రారంభం కావాలి. ఈలోగా ఉన్న ఇటుక నిల్వల విక్రయాలు పూర్తి కావాలి. అయితే ముక్తేశ్వరం, అయినవిల్లిలంక ప్రాంతంలోని మొత్తం బట్టీల్లో 10 బట్టీల్లో మాత్రమే మళ్లీ ఇటుకలతీత ప్రారంభించారు. మిగతావన్నీ సంక్రాంతి తర్వాతే ప్రారంభించే అవకాశముంది.

పెరిగిన ఖర్చులు

ఇదిలా ఉండగా ఇటుక నిర్మాణ ఖర్చులు బాగా పెరిగిపోయాయని బట్టీల యజమానులు చెబుతున్నారు. మట్టి ధర, కూలీల ఖర్చు, బొగ్గు, ఊక ధరలు రెట్టింపై, నష్టాలు అధికమయ్యాయని వారు పేర్కొంటున్నారు.

తయారీ కష్టమే..



నాణ్యమైన ఇటుకలు తయారు చేసి వెయ్యి ఇటుకలకు రూ.7000 రేటుకు అమ్మితే గిట్టుబాటవుతుంది. ప్రస్తుతం 1000 ఇటుకల రేటు రూ.5500–రూ.6000 వరకూ ఉంది. అయినా అమ్మకాలు లేవు. ముడి సరకుల ధరలు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ఇటుక తయారీ కష్టంగా ఉంది. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా నామమాత్రపు వడ్డీకి రుణ సహాయం అందించాలి.

– మిండగుదిటి విష్ణు, బట్టీ యజమాని, ముక్తేశ్వరం

గిట్టుబాటు కావడం లేదు



2016లో వెయ్యి ఇటుక రూ.6500 రేటుకు విక్రయించాం. ఇప్పుడూ అవే ధరలు. ముడి సరకులు ధరలు పెరిగాయి. రూ.లక్షలకు లక్షలు అప్పులు తెచ్చి మరీ పెట్టుబడి పెట్టాం. ఇసుక లేక కట్టడాలు నిర్మాణం ప్రారంభం కాలేదు. దీంతో ఇటుక అమ్మకాలు లేవు. ప్రభుత్వం గృహనిర్మాణాలను త్వరితగతిన ప్రారంభిస్తే మాకు మేలు చేసినవారవుతారు.

– శ్రీరెడ్డి దొరబాబు, బట్టీ యజమాని, అయినవిల్లిలంక

ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రదర్శన


అంతర్వేదిపాలెంలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట్

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్‌ఫెయిర్ ఏర్పాటు చేశారు. డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా ఆదేశాలపై ఎంఈవో–1, 2 డి.కిషోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావులు సైన్స్‌ఫెయిర్‌ను నిర్వహించారు. 15 ప్రభుత్వ పాఠశాలలు, 6 ప్రైవేటు పాఠశాలలుకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. విద్యార్థులు తాము తయారు చేసిన ప్రాజెక్టులను సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించారు. సైన్స్, టెక్నాలజీ, కమ్యూనికేషన్ ప్రాజెక్ట్, ట్రాన్స్‌పోర్టేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్, ఫుడ్, హెల్త్ ప్రాజెక్ట్, అగ్రికల్చర్ ప్రాజెక్ట్, క్లీన్‌నెస్, వేస్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేశారు. జడ్జీలుగా మలికిపురం గెజిటెడ్ హెచ్‌ఎంలు సీహెచ్ చింతామణి, మెహర్‌మూర్తి, శ్రీనివాసరావులు వ్యవహరించారు. పాఠశాలల గెజిటెడ్ హెచ్‌ఎంలు కె.వీరాస్వామి, జె.కనకలింగేశ్వరరావు, ఎస్.శ్రీధర్ కృష్ణ, కేవీ నాగేశ్వరరావులు, వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

‘పోషణ్ వాటిక’తో కూరగాయల పెంపకం


పాశర్లపూడిలంకలో పోషణ్ వాటికను ప్రారంభిస్తున్న సర్పంచ్ ప్రకాశరావు

మామిడికుదురు: ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన పోషణ్ వాటిక కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయల పెంపకం చేపట్టాలని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు తెలిపారు. పాశర్లపూడిలంక అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ వాటిక కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. దీనిలో భాగంగా ఒక్కో కేంద్రానికి ప్రభుత్వం రూ.10 వేలు జమ చేస్తుందన్నారు. వీటితో ఆకు కూరలు, కూరగాయల మొక్కలు నాటడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చెరుకూరి సత్తిబాబు, వార్డు సభ్యుడు భాను, గ్రామ సంఘం అధ్యక్షురాలు మేడిది లక్ష్మీపార్వతి, అంగన్‌వాడీ టీచర్ తురాయి నాగలక్ష్మి, వీఓఏ వంగా నాగమణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రియా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మలికిపురం: రాష్ట్ర స్థాయి క్రియా పిల్లల పండగ పోటీల్లో మండలంలోని మేడిచర్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 28 29 తేదీల్లో కాకినాడ జేఎన్టీయూలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రియా పిల్లల పండగ పోటీల్లో మేడిచర్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో 9 బహుమతులు గెలుచుకున్నారు. బుర్రకథలు సీనియర్స్ విభాగంలో పి.ధరణి, ఎం.వినీల, ఆర్.సాయిసుస్మితలకు ప్రథమస్థానం, సబ్ జూనియర్స్ విభాగంలో ఎం.బాలాత్రిపుర సుందరి, ఎం.ప్రసన్న, జి.యువనందినిలకు ద్వితీయ స్థానం, క్రాఫ్ట్ జూనియర్స్ ఎం.హస్విక, క్రాస్ సబ్ జూనియర్స్ తృతీయ బహుమతి బాలాత్రిపుర సుందరి, కథ చెప్పడం జూనియర్స్ ద్వితీయ బహుమతి ఎం.రాజేష్ కుమార్, కన్సోలేషన్ బహుమతి జి.అనన్యలకు దక్కాయి. సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను అభినందించారు.

సెవెన్త్ టాపర్లకు ప్రతిభా పురస్కారం

పి.గన్నవరం: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా విశ్రాంత ఉపవిద్యాశాఖ అధికారి(డీవైఈవో) మైలవరపు రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని మానేపల్లి బాలుర, బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 2023–24లో 7వ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానాలు సాధించిన ఇద్దరు విద్యార్థులకు వక్కలంక రామారావు ప్రతిభా పురస్కారాలను సోమవారం జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులు గోగు వెస్లేరాజు, మోకా రక్షితలకు రూ.5 వేల వంతున బహుమతి అందజేశారు. బాలికల పాఠశాల హెచ్‌ఎం కె.వెంకట సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశ్రాంత డీవై ఈఓ రవీంద్రనాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో బాలుర పాఠశాల హెచ్‌ఎం గాలి దేవర శ్రీనివాస్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు రాష్ట్రపతి అభినందనలు


సదస్సులో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్రపతి ముర్ము

మలికిపురం: ఈనెల 24న ఢిల్లీలో జరిగిన 1ఎం1బి జాతీయ యువ మార్పు తయారీదారుల రాష్ట్రపతి సదస్సుకు మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల విద్యార్థులు హాజరై రాష్ట్రపతి ముర్ము అభినందనలు అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల యువతలో నైపుణ్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న 1ఎం1బీ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో 15 మంది విద్యార్థులు ఎంపిక కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున వివేకానంద విద్యార్థినులు పెసల భువనసాధిక, నల్లి రోజలిన్‌లు ఎంపిక య్యారు. వివిధ దశల్లో జరిగిన జాతీయ స్థాయి ప్రాజెక్ట్ సెలక్షన్స్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి వివేకానంద విద్యార్థుల ఈ వేస్ట్ ప్రాజెక్ట్ ఎంపికయింది. రాష్ట్రపతి ముర్ము సమక్షంలో వివేకానంద స్కూల్ విద్యార్థినులు పెసల భువనసాధిక, నల్లి రోజలిన్‌లు రూపొందించిన ఈ వేస్ట్ ప్రాజెక్టును వివరించి ప్రశంసలు అందుకున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

అయినవిల్లి/ఆలమూరు: గ్రామాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ తెలిపారు. సోమవారం వెలువలపల్లి, చింతనలంక గ్రామాలకు వెలువలపల్లి గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వెలువలపల్లిలో రెండు, చింతనలంకలో మూడు అర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు. ఆలమూరు మండలంలోని మడికిలో గ్రామ పంచాయతీ వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో పలువురు రైతుల ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులను పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. డీటీ సుబ్బరాజు, వీఆర్వోలు, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

మలికిపురం: నియోజకవర్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఇటీవల నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల చైర్మన్‌లు, ఇరిగేషన్, డ్రైన్స్ అధికారులతో సోమవారం మలికిపురం ఎల్‌ఎస్ ల్యాండు మార్కు వద్ద సమీక్షించారు. ఇటీవల ఎన్నికైన సాగునీటి సంఘాలు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలన్నారు. గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, ఎంపీపీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రాజోలు మండలం తాటిపాకకి చెందిన ఏడాది చిన్నారి బైరిశెట్టి ప్రజ్ఞ వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ కేతా శ్రీను, ముప్పర్తి నాని పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


అంబాజీపేటలో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ భీమరాజు

సఖినేటిపల్లి: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకలను బహిరంగ ప్రదేశాల్లో జరుపుకోవడం నిషేధమన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం, అర్ధరాత్రి రహదారులపై కేక్ కటింగ్‌లు చేయడం, సైలెన్సర్లు తీసి మోటార్ వాహనాలు నడపడం, గుంపులుగా చేరి రోడ్లపై అల్లర్లు చేయడం వంటివి ఎవరు చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి, ప్రమాదాలకు గురికావద్దని, కుటుంబ సభ్యులను క్షోభకు గురి చేయవద్దని ఆయన సూచించారు. మంగళవారం సాయంత్రం నుంచి మండలంలోని అన్ని ప్రధాన కూడళ్లలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనలు, పోలీసు హెచ్చరికలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే వారిపై శాఖాపరమైన చర్యలతో పాటు వాహనాలను సీజ్ చేసీ, భారీ జరిమానా విధిస్తామని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు హెచ్చరించారు. అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనదారులకు సోమవారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ భీమరాజు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలో పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం పోలీస్ స్టేషన్ పరిధిలో నాకా బందీ నిర్వహించి 113 వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించామన్నారు. డిసెంబర్ 31, నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారు శాంతియుతంగా ఇళ్ల వద్దే నిర్వహించుకోవాలన్నారు. రోడ్లపైకి వచ్చి ఇష్టానుసారం వాహనాలు నడిపినా, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, రోడ్లపై కేకులు కట్‌చేసినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా సహించేది లేదన్నారు. సీఐ వెంట ఎస్సైలు కె.చిరంజీవి, కె.చైతన్యకుమార్, శివకృష్ణ, కేఎస్ జోషి ఉన్నారు.

సంక్షిప్తంగా..

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పదోతరగతి విద్యార్థుల స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ జరిగింది. ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, పీవీ సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీఓ ఎ.రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండల ఎస్టీయూ శాఖ సమకూర్చిన ఈ స్టడీ మెటీరియల్‌ను వారు ఆవిష్కరించారు. పదోతరగతి విద్యార్థులకు చక్కని ఉత్తీర్ణత సాధించుటకు ఈ మెటీరియల్ దోహదపడుతుందన్నారు. మండల పరిషత్ పరిపాలన అధికారి ఎంపీఎం.ప్రకాష్, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాష్ట్ర నాయకులు చక్రవర్తి, రాజగోపాల్ పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఎస్టీయూ రూపొందించబడిన పదో తరగతి మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీరభద్రరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నందం వీవీ సత్యనారాయణ ఆర్థిక సాయంతో 61 మంది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో పేకాట శిబిరంపై ఆలమూరు పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆదేశాలతో ఎస్సై అశోక్ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.21,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆయన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట: స్థానిక సంతమార్కెట్‌లో వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు. స్థానిక పలువురు వ్యాపారులు ముఖ్యంగా మాంసాహార వ్యాపారుల విజ్ఞప్తి మేరకు సోమవారం కొత్తపేట వారపు సంత సందర్భంగా ఎమ్మెల్యే బండారు సంతమార్కెట్‌ను సందర్శించారు. వ్యాపారులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సంబంధిత అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ బూసి జయలక్ష్మి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దే ఆదినారాయణ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పలు వాహనాల సీజ్

కొత్తపేట: ముగుస్తున్న ప్రస్తుత సంవత్సరం, రానున్న న్యూ ఇయర్, సంక్రాంతి పండగ పురస్కరించుకుని ప్రమాదాల నివారణకు సోమవారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న పలు మోటారు వాహనాలపై జాగ్రత్తలు పాటించకుండా ప్రయాణించి ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ పర్యవేక్షణలో ఎస్సై జి.సురేంద్ర సిబ్బందితో స్థానికంగా పలు సెంటర్లలో నిఘా వేసి బైక్‌లను ఆపి రికార్డులను తనిఖీ చేశారు. ఇద్దరు మించి ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ వాహనాదార్లను, నలుగురుకు మించి ప్రయాణికులతో రవాణా సాగిస్తున్న ఆటోలను సీజ్ చేశారు. పలు వాహనాలకు ఫైన్ వేశారు.

ఈదరాడలో రీసర్వే ప్రాజెక్టు గ్రామసభ

మామిడికుదురు: ఈదరాడలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు గ్రామసభ సోమవారం జరిగింది. దీనిలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండలంలో భూముల సర్వేపై రెండు గ్రామాల్లో సర్వే జరిగిందని డిప్యూటీ తహసీల్దార్ శరణ్య తెలిపారు. మూడో గ్రామంగా ఈదరాడను ఎంపిక చేశారన్నారు. రీ సర్వేలో భాగంగా గ్రామంలో ఉన్న భూములపై సమగ్ర సర్వే జరుగుతుందన్నారు. దీని వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు, గ్రామ రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ పరిశీలన

పి.గన్నవరం: కాయకల్ప అవార్డు కోసం పి.గన్నవరం సీహెచ్‌సీని పాలకొల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యుడు రవికుమార్ సోమవారం పరిశీలన చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను, పారిశుధ్య చర్యలను, ఇన్ పేషెంట్ రూమ్‌లను ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. సీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఆస్పత్రి నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత ఉన్నతాధికారులకు రవికుమార్ నివేదిక సమర్పించనున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రావులపాలెం: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. ఆలయ డీసీ నల్లం చక్రధర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో స్వామివారి అనుగ్రహం అందరిపైన ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంతస క్రిస్మస్

కొత్తపేట: దేవుని కుమారుడిగా జన్మించిన యేసు క్రీస్తు ద్వారా లోకానికి వెలుగు వచ్చిందని, ఆ వెలుగు సర్వ మానవాళి జీవితాల్లో ప్రకాశించే విధంగా విశ్వాసబద్ధులై ముందుకు సాగాలని అంతర్జాతీయ ప్రవచన దేవుని సంఘం కొత్తపేట యెరూషలెం చర్చి పాస్టర్, రీజినల్ ఓవర్‌సీర్ బిషప్ జి.అబెద్నగో అన్నారు. క్రిస్మస్ మాసం సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇవాంజెలికల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అండ్ స్థానిక సంఘాల సంతస క్రిస్మస్ ఆరాధన వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ క్రీస్తు ప్రబోధకుడు డాక్టర్ ఐజయ్య, బ్రదర్ రాజేంద్ర ముఖ్య వర్తమానికులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిస్తున్నాయని అన్నారు. పేదలకు వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలువురు క్రీస్తు ప్రబోధకులు, నియోజకవర్గ వ్యాప్తంగా పాస్టర్స్, అత్యధిక సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్‌కు వినూత్నంగా విద్యార్థుల విషెస్


విద్యార్థులు రూపొందించిన చిత్రాలు

మామిడికుదురు: ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు న్యూ ఇయర్‌కు వినూత్నంగా స్వాగతం పలికారు. పోస్టు కార్డులపై స్వచ్ఛ భారత్, సేవ్ వాటర్, సేవ్ ఎన్విరాన్‌మెంట్, సేవ్ ట్రీస్ అని చిత్రాలు వేశారు. వీటితో న్యూ ఇయర్ గ్రీటింగ్స్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నాగప్రసాద్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ సారథ్యంలో విద్యార్థులు రూపొందించారు.

ఎస్సీ కులగణన గడువు పెంచాలి

అంబాజీపేట: ఎస్సీ కులగణనకు సంబంధించి సవరణలు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు ఇవ్వాలని ఎంఆర్పీఎస్ నాయకుడు ఉందుర్తి నాగబాబు అన్నారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ జీవీ సరోవర్‌కు సోమవారం అందజేశారు. నాగబాబు మాట్లాడుతూ ఎస్సీ కులగణన జాబితాలో తప్పులు ఉన్నాయని, కులాలను మార్పు చేసి జాబితా సిద్ధం చేశారన్నారు. వాటిని సవరించేందుకు తక్షణమే ప్రభుత్వం గడువు పెంచాలన్నారు. లేని పక్షంలో మాదిగ కులస్తులకు అన్యాయం జరుగుతుందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

పరిరక్షణ చైతన్య సమితికి ప్రభుత్వ గుర్తింపు

మలికిపురం: రాజోలు నియోజకవర్గ పరిరక్షణ చైతన్య సమితి కార్యవర్గ సమావేశం సమితి అధ్యక్షుడు నల్లి ప్రసాదరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో పరిరక్షణ చైతన్య సమితి ప్రభుత్వంచే గుర్తింపు పొందిన రిజిస్టర్ బాండును సమావేశంలో అధ్యక్షులు విడుదల చేశారు. నియోజకవర్గ ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పని చేయించుకునేందుకు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. సమావేశంలో చింతా సత్య, ముత్యాల శ్రీనివాసరావు, బడుగు సాయిబాబా, కుడిపూడి శివమణి, రాపాక రత్నరాజు, రాపాక కిరణ్, పమ్మి రత్నరాజు, గెద్దం బాలరాజు, జనిపల్లి సత్య, చెవ్వాకుల వెంకట్ పలువురు మాట్లాడారు.

క్లుప్తంగా

కొత్తపేట ఎస్సై సురేంద్రకు రివార్డు

కొత్తపేట: పెండింగ్ కేసుల పరిష్కారంలో కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర ఎస్పీ బి.కృష్ణారావు నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ సంవత్సరంలో కేసుల దర్యాప్తు పరంగా ప్రతిభ చూపిన పోలీసు అధికారులకు ఎస్పీ రివార్డులు అందజేశారు. ఇందులో భాగంగా అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఎస్పీ చేతుల మీదుగా ఎస్సై సురేంద్ర రివార్డు (నగదు) అందుకున్నారు. గడిచిన మూడు నెలల్లో కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న దాదాపు 150 కేసులను ఎస్సై సురేంద్ర పరిష్కరించినందుకు ఆయన ఈ రివార్డు అందుకున్నారు.

ఎస్సై అశోక్‌కుమార్‌కు క్యాష్ రివార్డు

ఆలమూరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్సై)గా పనిచేస్తున్న ఎం.అశోక్ కుమార్‌కు క్యాష్ అవార్డు లభించింది. మండలంలోని 216 ఏ జాతీయ రహదారిపై ఇటీవల కాలంలో ప్రమాదాల నివారణకు ఎస్సై అశోక్ ప్రత్యేక దృష్టి సారించి సఫలీకృతులయ్యారు. దీంతో జిల్లా పోలీసుశాఖ ఎస్సై అశోక్ సేవలను గుర్తించి ఈ రివార్డుకు ఎంపిక చేసింది. అమలాపురంలో ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు చేతుల మీదుగా ఎస్సై అశోక్ క్యాష్ రివార్డును స్వీకరించారు.

ఫొటోగ్రాఫర్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

అంబాజీపేట: మండల ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని పుల్లేటికుర్రు బూరుగులమ్మ మండపం వద్ద ఎన్నుకున్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గెద్దం సురేష్‌కుమార్ అధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా గంటా గిరి, అధ్యక్షుడిగా వైవీ రమణ, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.రాము, సెక్రటరీగా పి.ప్రతాప్, జాయింట్ సెక్రటరీగా ఎస్.వినోద్‌కుమార్, ట్రెజరర్‌గా కె.శ్యామ్, సభ్యుడిగా సీహెచ్ వెంకట్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి, సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, ఫొటో, వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

శిశుమందిర్‌ను సందర్శించిన బ్యాంకు బృందం

మలికిపురం: మండలంలోని లక్కవరం సరస్వతీ శిశుమందిర్‌ను సోమవారం కెనరా బ్యాంకు బృందం సందర్శించింది. కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కలిదిండి సత్యనారాయణరాజు మంజూరు చేసిన రూ.12 లక్షలతో లక్కవరం శిశు మందిరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన జరుగుతుంది. పనులు పూర్తయిన సందర్భంగా బ్యాంక్ కాకినాడ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.గణేష్, సీనియర్ మేనేజర్ ముదునూరి పద్మరాజుల బృందం శిశు మందిరాన్ని సందర్శించారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేవారు. కార్యక్రమంలో నిధులు రావడానికి కృషి చేసిన లక్కవరం చాంబర్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజును అభినందించారు. కార్యక్రమంలో మంగెన వెంకట నరసింహారావు, ముదునూరి విష్ణుమూర్తి రాజు, బ్రాంచ్ మేనేజర్ జైరామ్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని వినతి

రాజోలు: గోదావరిలో ఇసుక తీసుకుని జీవనాధారం పొందే అగ్నికుల క్షత్రియులకు ఉపాధి కల్పించాలని కోరుతూ రాజోలు తాలూకా అగ్నికుల క్షత్రియుల సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. కొన్ని నెలలుగా ఇసుక ర్యాంపులు తెరవకపోవడంతో ఇసుక తీసే అగ్నికుల క్షత్రియులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్‌కు సంఘ అధ్యక్షుడు బొమ్మిడి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బొమ్మిడి మహేష్ వివరించారు. రాజోలు గ్రామ పంచాయతీలో పలు సమస్యలపై బొమ్మిడి మహేష్ ఫిర్యాదు చేశారు. వార్డు సభ్యులు ఇతర దేశాలకు వెళ్లిపోయారని, వారు సమావేశాలకు రాకపోయి నా వచ్చినట్టు సంతకాలు చేస్తున్నారని, వార్డు సభ్యుల గైర్హాజరుపై విచారణ చేపట్టాలని కోరారు.

సంయుక్త కృషితో ఉత్తమ ఫలితాలు

కొత్తపేట: పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లు, ఉపాధ్యాయుల సంయుక్త కృషితో పాఠశాలల్లో అన్నింటా ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) సలీం బాషా సూచించారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల సౌకర్యాలు, ఉత్తమ ఫలితాలు తదితర అంశాల్లో ఎస్ఎంసీలు, ఉపాధ్యాయుల విధులు, బాధ్యతలపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాయంలో కొత్తపేట డివిజన్ పరిధిలోని అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం, కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు, ఇద్దరు ఎస్ఎంసీ సభ్యులు 35 మందికి ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఎంఈఓ ఎం.హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్ఎంసీ సభ్యులు అందరూ పాఠశాలలను తరచూ సందర్శించాలని, ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరుగుతుందా? భోజనం నాణ్యత బాగుంటుందా? అని పర్యవేక్షిస్తూ నూరు శాతం విద్యార్థులు భోజనం చేసే విధంగా మీ వంతు కృషి చేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లుగా కేవీ శేఖర్ (రావులపాలెం), డీఎస్‌వీ ప్రసాద్ (పి.గన్నవరం), ఎం.నాగరాజు (కొత్తపేట) వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.లీలావతి, డీసీఈబీ సెక్రటరీ హనుమంతరావు, హెచ్‌ఎం బండారు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.